క్లుప్తంగా

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న మలేరియా విభాగ అధికారి రవికుమార్

మల్కాపురం: వారంలో ఒక రోజు ప్రతి ఒక్కరూ డ్రై డే పాటించాలని మల్కాపురం ఏరియా మలేరియా విభాగ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ కోరారు. 59వ వార్డు గణపతినగర్ ప్రాంతంలో ఫ్రైడే –డ్రైడే శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజారోగ్య విభాగం టెక్నికల్ సూపర్‌వైజర్ భవాని, రవికుమార్ మాట్లాడుతూ ఇంట్లో నీటి నిల్వలు ఉంచరాదన్నారు. నీటి కుండీలపై పై కప్పులు అమర్చాలని సూచించారు.డెంగ్యూ, చికున్ గునియా,మలేరియా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మంచినీటి నిల్వల్లోనే డెంగ్యూ కారక దోమలు విజృంభిస్తాయని తెలిపారు. తప్పనిసరిగా వారానికి ఒకసారి రోజువారీ అవసరాలకు మినహా మిగిలిన నీటి పాత్రలను ఆరబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు కేంద్రానికి వివరించండి'



సంజీవరెడ్డితో మాట్లాడుతున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం : కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల చాలా మంది కార్మికులు ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నారని, కార్మికుల కష్టాలను కేంద్ర ప్రభుత్వానికి వివరించమని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం కోరారు. సంజీవరెడ్డిని మర్యాదపూర్వంగా శుక్రవారం కలిసిన భోగవల్లి కార్మికుల సమస్యలను వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, ఇదంతా ప్రైవేటీకరణలో భాగమేనని వివరించారు. అలాగే విశాఖ పోర్టు ట్రస్టు ఆస్పత్రిని ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించేందుకు కేంద్రం సిద్ధమైందన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందన్నారు. ఈ సమస్యలను కేంద్ర మంతులకు వివరించి, కార్మికులను ఆదుకోవాలని కోరారు. దీనిపై సంజీవరెడ్డి సానుకూలంగా స్పందించారని భోగవల్లి తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ. 3.50 లక్షల పరిహారం

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా, బాధితులకు పరిహారం అందేవరకు అన్ని విధాల సహాయం అందిస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ సహాయక కేంద్రం తీసుకున్న చర్యల ఫలితంగా ఇటీవల 'హిట్ అండ్ రన్' ప్రమాదాల్లో తీవ్ర గాయాలైన గాజువాకకు చెందిన బడ్డి సరస్వతి, ఇందుకూరి అప్పలరాజు, దేవర నూకరాజు, పర్వీన్ బేగం, కొండ్రి కృష్ణమ్మ మరియు డాబా గార్డెన్స్ ప్రాంతానికి చెందిన పద్మనాభుని ఆండాలమ్మలకు ఒక్కొక్కరికీ రూ 50,000 చొప్పున మొత్తం రూ. 3.50 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 69 మంది బాధితులకు మొత్తం రూ. 55.50 లక్షల పరిహారం అందజేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాద కేసుల్లో ఎవరికైనా సహాయం కావాలంటే రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రంలో గాని, లేదా టోల్ ఫ్రీ నంబర్ 7995095793కి గాని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తులు

మహారాణిపేట: ప్రభుత్వ, ప్రైవేటు ట్రైనింగ్ సెంటర్లలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) కోర్సులో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి, దరఖాస్తులు సమర్పించడానికి సెప్టెంబర్ 30 చివరి తేదీ అని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. పూర్తి వివరాలకు https://cfw.ap.nic.in/ను సందర్శించాలని సూచించారు.



మేము జంక్ ఫుడ్ మానేశాము చేతులెత్తి చెబుతున్న విద్యార్థులు

జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలు అందరికీ తెలుసు.. అయినా పిల్లలను వాటి నుంచి దూరం చేయలేకపోతున్నాం. కానీ ఈ పాఠశాల ఉపాధ్యాయులు తాము పాటిస్తూ విద్యార్థుల్లో మార్పునకు బాట వేశారు. చాక్‌లెట్లు, ప్యాకింగ్ చేసిన తినుబండారాలు పాఠశాలలకు తీసుకు రావడాన్ని నిషేధించారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే అనారోగ్యాల గురించి విద్యార్థులకు వివరించారు. వాటికి బదులు పండ్ల ముక్కలు, వేరుశనగ చిక్కీలు వంటివి తీసుకు రావాలని సూచించారు. దీంతో వారిలో మంచి మార్పు వచ్చింది. వారు ఆచరించడమే కాకుండా పలువురికి చెబుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు గవరవీధి జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు. – గోపాలపట్నం

- జంక్‌ఫుడ్‌కు దూరంగా గవరవీధి జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు
- విద్యార్థుల్లో మార్పు తీసుకొస్తున్న ఉపాధ్యాయులు
- పుట్టిన రోజు వేడుకల్లో కేకులు, చాక్‌లెట్లు నిషేధం
- పండ్లు పంచుతున్న వైనం
- వృక్షనిధి ద్వారా మొక్కల సేకరణ
- ఆదర్శంగా నిలుస్తున్న పాఠశాల

పండ్లు.. కీరా..క్యారెట్ ఇవే మా స్నాక్స్



వాటర్ మిలాన్ ఫ్రూట్ కేక్



పుట్టిన రోజు ఫ్రూట్ కేక్ కత్తరిస్తున్న దృశ్యం

విద్య ఎవరైనా చెబుతారు... ఎక్కడైనా నేర్చుకోవచ్చు కాని విలువలతో కూడిన విద్య మాత్రం కొన్ని పాఠశాల్లోనే లభ్యమవుతుంది. అదే కోవకు చెందుతుంది జీవీఎంసీ 91వ వార్డు పరిధిలోని గవర వీధి జీవీఎంసీ పాఠశాల. అందుకే పాఠశాల పలు పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది. అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

చాక్‌లెట్లకు బైబై

పాఠశాలలో ఏ విద్యార్థి పుట్టిన రోజు వేడుక చేసుకోవాలన్నా కేకుకు బదులుగా పండ్లతో చేసిన కేక్ తయారు చేస్తారు. చాక్‌లెట్లకు బదులుగా అరటి పండ్లు, మాపిల్ ముక్కలు వంటివి పంపిణీ చేస్తున్నారు. ఉపాధ్యాయులకు చాకపీస్‌లు, ఇతర అభ్యసన సామగ్రి అందజేస్తున్నారు.

సహజ సిద్ధమైన తినుబండారాలే...

పిల్లలకు పాఠశాల విరామ సమయంలో తినే తినుబండారాలు సహజసిద్ధమైనవే ఉండాలని ఉపాధ్యాయులు నిర్ణయించారు. ఇందుకు తగిన విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారు కూడా సంతోషంగా ఒప్పుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ప్రతీ విద్యార్థి సహజ సిద్ధమైన తినుబండారాలు తీసుకువచ్చే స్థాయికి వచ్చారు.

మొక్క బహుమతిగా ఇవ్వండి

..పుట్టిన రోజులు, ప్రతేక దినాల్లో బహుమతులుగా ఏమీ వద్దు.. పిల్లలు సెలవులు పెట్టకుండా స్కూల్‌కు పంపించడం.. ప్రేమగా వారితో కొంత సేపు గడపడం, పాఠశాలకు మంచి మొక్క బహుమతిగా ఇవ్వడం వంటివి మాత్రమే చేయండి.. ఇవి భావితరాలకు మంచిని అందిస్తాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



పండ్లు, కీరా,క్యారెట్‌లతో స్నాక్స్ బాక్సులు

చిన్నగా మొదలై...

తాము ఆచరిస్తూ మరి కొందరిలో మార్పు తీసుకురావాలని పాఠశాల ఉపాధ్యాయులు చూపిన చొరవ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది. ఇప్పుడు వారు ఆచరించడమే కాకుండా కుటుంబ సభ్యులకు కూడా జంక్‌ఫుడ్ తినడం వల్ల అనర్థాలను వివరిస్తున్నారు. పిల్లల్లో వచ్చిన మార్పు తమకే ఆశ్చర్యం కలుగుతుందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

మా బంధువుల్లో మార్పు తీసుకు వచ్చాను



మా ఇంట్లో మార్పు తీసుకు వచ్చాను. అలాగే మా బంధువులకు కూడా అవగాహన కల్పించడంతో అందరూ జంక్ ఫుడ్ మానేశారు. చాక్‌లెట్లు, ప్యాకెట్ ఫుడ్, చిప్స్ వంటివి తీసుకు రావడం లేదు. వాటి వల్ల కలిగే అనారోగ్యాల గురించి వివరించారు. కురుకురేని కాల్చి చూపించాను. దీంతో వారిలో మార్పు వచ్చింది. మీరూ మారండి.. జంక్ ఫుడ్ మానండి. – **మోన్విత యడ్ల, జీవీఎంసీ పాఠశాల**

పిల్లల భవిష్యత్తు కోసం ..



పిల్లల భవిష్యత్తు కోసం జంక్ ఫుడ్ మాన్పిస్తున్నాం. తొలి ప్రయత్నం ఫలించింది. 6వ తరగతి, నాలుగో తరగతి విద్యార్థుల్లో మార్పు సాధించాం. ఇంకా మిగిలిన విద్యార్థుల్లో మార్పు తీసుకు వస్తున్నాం. త్వరలో పూర్తి స్థాయిలో మార్పు సాధిస్తాం.

– **టి. జగన్నాథం, ఉపాధ్యాయుడు**

జంక్ ఫుడ్ మానేశాం



పాఠశాలలో కాదు ఇంటి వద్ద కూడా జంక్ ఫుడ్ మానేశాను. ఇంట్లో కూడా అందరిలో మార్పు తీసుకు వచ్చాను. పండ్లు, సహజమైన గింజలు, కీర, క్యారెట్ వంటివి పాఠశాలకు తీసుకు వస్తున్నాను. చాలా బాగుంది.

–**ఆలిబిల్లి ఖ్యాతిశ్రీ, 4వ తరగతి**

పాఠశాలకు మంచి పేరుంది



మా పాఠశాలకు మంచి పేరుంది. దానిని నిలబెడుతూ పలువురికి ఆదర్శంగా ఉండేలా తీర్చి దిద్దుతాం. జంక్ ఫుడ్ నిషేధం విషయంలో ఉపాధ్యాయుల నిర్ణయాన్ని సంతోషంగా స్వాగతించారు. సాతంత్ర్య దినోత్సవం రోజున పిల్లలందరికీ అరటి పండ్లు పంచి పెట్టాం. ముందు మేము మారాం. తర్వాత పిల్లల్లో మార్పుకోసం ప్రయత్నించాము. మేము పలు పాఠశాలలకు ఆదర్శంగా నిలిచాం.చాలా సంతోషంగా ఉంది. . **కె. సత్యనారాయణ, హెచ్‌ఎం జీవీఎంసీ పాఠశాల**

చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించాలి

మల్కాపురం : ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చంద్రబాబు, పవన్, లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయకుడా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ 59వ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆరోపించారు. వార్డు పరిధి నక్కవానిపాలెం, పాత చెక్‌పోస్టు ఏరియా, శాంతిగిరి కాలనీ, గాజువాక ఆర్టీసీ డిపో ఏరియాలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆదేశాలతో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మోసాలను వివరించారు. వైఎస్సార్ సీపీ ముద్రించిన కరపత్రాలపై గల క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు మోసాలన్నీ తెలుస్తాయని సూచించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు ఎవరెవరికి ఏయే పథకాలు అందాయో తెలుసుకున్నారు. అనంతరం రేవళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పేరిట హామీలు ప్రకటించారని... ఆ మాయ మాటలు నమ్మి ప్రజలు ఓట్లేయడంతో అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు విస్మరించారని విమర్శించారు. అర్హులందరికీ కొత్తగా పింఛన్లు ఇవ్వడం మాట అటుంచితే ఎంతో మంది దివ్యాంగుల పింఛన్లు తొలగించేస్తున్నారని ఆరోపించారు. ఆడ బిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్నే అమ్మేయాలని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పథకాలు అమలు చేయడం చేతగానప్పుడు ఎందుకు హామీలిచ్చారని ప్రశ్నించారు. జనహృదయ నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరట ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అములు చేశారని గుర్తు చేశారు. కరోనా విజృంభించిన కష్టకాలంలో కూడా పథకాలు అమలు చేశారన్నారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వ మోసాలు గుర్తించి ఆ పార్టీల నాయకులను నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకినాయుడు, పైడితల్లి, దేవర రమేష్, ఖాన్, ఎడ్ల సత్యనారాయణ, కోరాడ శ్రీనివాసరావు, డేవిడ్, దానీ, రూప, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రిని సందర్శించిన షిప్‌యార్డు సీఎండీ



పశువైద్యశాల స్థితిగతులను డాక్టర్‌ను అడిగి తెలుసుకుంటున్న సీఎండీ రాకేష్‌ప్రసాద్

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రిని శుక్రవారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్ ప్రసాద్ సందర్శించారు. ఆస్పత్రి స్థితిగతులను పశువైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పశువైద్యశాల అద్దె చెల్లించాలని గత సంవత్సరం నోటీసు ఇచ్చినా చెల్లించలేదన్నారు. ఈ విషయంపై డాక్టర్ సునీల్ మాట్లాడుతూ గతంలో మాదిరి అద్దె లేకుండా భవనం ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎండీ త్వరలోనే అద్దె విషయం ప్రకటిస్తానని హామీ ఇచ్చారని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ అధికారులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మల్కాపురం: కంప్యూటర్లలో వైరస్ ను వ్యాప్తి చేయడం, ఆన్ లైన్ మోసాలు, మొబైల్ ఫోన్ల ద్వారా వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీసే సందేశాలు పంపడం వంటి వివిధ రకాల సైబర్ నేరాలు పెరిగాయని.. వీటి బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిపుణుడు సి.హెచ్.దుర్గామల్లేశ్వర్ అన్నారు.మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలియని లింకులను, ఇ- మెయిల్స్‌ను ఓపెన్ చేయవద్దని సూచించారు. అనుమానంగా ఉండే మెయిల్స్, ఫోన్ కాల్స్‌కు సమాధానాలు ఇవ్వకూడదని వివరించారు. సైబర్ నేరగాళ్లు చాలా చురుగ్గా వ్యవహరిస్తుంటారని,యువత అప్రమత్తంగా ఉంటూ మోసాలకు గురి కాకుండా చూసుకోవాలన్నారు.ఎలాంటి అనుమానం ఉన్నా తక్షణమే సైబర్ పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళ లేక మహిళ ఆత్మహత్యాయత్నం

- సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద ఘటన
- కాపాడిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది

గోపాలపట్నం: అప్పుల బాధ తాళ లేక మహిళ ఆత్మహత్యకు పాల్పడుతుండగా ఆర్‌పీఎఫ్ పోలీసులు కాపాడారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలివీ. గాజువాక వుడాకాలనీకి చెందిన సౌమ్య శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో సింహాచలం రైల్వే స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫారానికి చేరుకుంది. ట్రైన్ రాకను చూసి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తున్న సమయంలో అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రవి, ఏఎస్ఐ కేఆర్‌కే రావు, కొందరు ప్రయాణికులు ఆమెను అడ్డుకుని కాపాడారు. వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లేబ్ టెక్నీషియన్‌గా పనిచేసిన సౌమ్య లాభాలను ఆశించి షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టింది. అంతే కాకుండా మరి కొంత మంది చేత పెట్టుబడులు పెట్టించింది. నష్టాలు రావడంతో అప్పుల భారం తన మీద పడుతుందనే భయంతో చనిపోదామనుకుని ఇక్కడికి వచ్చింది. ఆ మొత్తం సుమారు రూ.80 లక్షల వరకు ఉంటుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నష్టాలు వచ్చాయని.. పెట్టుబడి పెట్టిన వారు డబ్బులు ఇవ్వాలని అడిగితే ఏం చెప్పాలో తెలియక మానసికంగా ఇబ్బందులు పడుతున్నట్టు చెబుతున్నారు. సకాలంలో సౌమ్యను రక్షించినందుకు ఆర్‌పీఎఫ్ పోలీసులు, ప్రయాణికులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కూటమి మద్దతు

- స్టీల్ గుర్తింపు యూనియన్ నేతల ఆరోపణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చేసి సెయిల్‌లో విలీనం చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎస్.ఎన్. రావు, డి.ఆదినారాయణ ఆరోపించారు. శుక్రవారం గుర్తింపు యూనియన్ నాయకులతో సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం 34 విభాగాలకు టీఎంసీ కోసం ఈవోఐలు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అయినా దీనిపై కూటమి పాలకులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే 4 వేల మందిని ఎలాంటి కారణం లేకుండా తొలగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత వేగం పెంచి కార్మికులపై కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. నిరాహార దీక్ష చేసుకోవడానికి కూడా అనుమతించక పోవడం దారుణమన్నారు. వీటన్నిటికీ కూటమి ప్రభుత్వం సహకరిందని మండిపడ్డారు. కూటమి నాయకులు ఇప్పటికైనా రాజకీయ విమర్శలను పక్కన పెట్టి... కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను చేసి సెయిల్‌లో విలీనం చేయడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

డీజే సౌండ్స్ నిషేధించాలని వినతి

మల్కాపురం : వినాయక మండపాల వద్ద మట్టి ప్రతిమలనే నెలకొల్పేలా, డీజే సౌండ్స్ నిషేధించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద గల లక్కీ అమర్ పాఠశాల విద్యార్థులు కోరారు. ఈ మేరకు గాజువాక పోలీసులకు వినతి పత్రం అందించారు. శుక్రవారం ఉదయం స్టేషన్ వద్దకు పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావుతో కలిసి వెళ్లి పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి ప్రతిమలు వినియోగించేలా చూడాలని పోలీసులను కోరారు. డీజే సౌండ్స్‌తో అసభ్యకర నృత్యాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వార్డు సమస్యలపై గళం విప్పిన బల్లా



జీవీఎంసీ కమిషనర్‌కి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింథియా: గడిచిన కౌన్సిల్ సమావేశంలో తన వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ఆమోదం లభించినా ఇప్పటి వరకూ కనీసం టెండర్ కూడా పిలవలేదు, దళితుడినైన నా వార్డు అభివృద్ధిపై వివక్ష చూపడం ఎంత వరకూ సమంజసమని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కౌన్సిల్‌లో తన గళం వినిపించారు. తనపై నమ్మకంతో వార్డు ప్రజలు భారీ మెజారిటీతో కార్పొరేటర్‌గా గెలిపించారని, కానీ ప్రజల నమ్మకానికి జీవీఎంసీ అధికారులు తూట్లు పొడుస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా వార్డులో అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు.

ఉల్లంఘనలపై ఫిర్యాదు

అలాగే కొద్ది రోజులుగా తనకు సమాచారం ఇవ్వకుండా వార్డులో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతున్న విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ దృష్టికి తీసుకెళ్లారు.శిలాఫలకాల్లో కూడా ప్రొటోకాల్ పాటించకుండా తన పేరును అవహేళన చేస్తూ ముద్రిస్తున్నారని, తక్షణమే ఆయా అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

గాజుల అలంకరణలో దుర్గాదేవి



గాజుల అలంకరణలో దర్శనమిచ్చిన దుర్గాదేవి



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

గోపాలపట్నం: కొత్తపాలెం ప్రధాన రహదారిలో వెలసిన దుర్గా దేవిఆలయంలో అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు సమర్పించిన గాజులతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

రెండు ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీ



ఐవీఎఫ్ సెంటర్ల రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: నగరంలోని పలు ఐవీఎఫ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, ఇతర సరోగసీ బృందంతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. సంతానోత్పత్తి కేంద్రాల్లోని ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, స్కానింగ్ మిషన్లను పరిశీలించారు. నోవా ఐవీఎఫ్ కేంద్రం, ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రాలను సందర్శించి, అక్కడి పరిస్థితుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో డీఎంహెచ్‌వో ఆ కేంద్రాలకు పలు సూచనలు చేశారు. ఆస్పత్రుల్లో ఏఆర్‌టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయా లేదా అని, వైద్యులు, ఇతర సిబ్బంది విద్యార్హతలను, ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ఈ తనిఖీ బృందంలో విక్టోరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ గీతా వందన, కేజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ రాధ, కేజీహెచ్ పాథాలజిస్ట్ డాక్టర్ టి. కిశోర్, కేజీహెచ్ సోషియాలజిస్ట్ డాక్టర్ శోభశ్రీ, సోషియాలజిస్ట్ ఎల్.వి. రమణి, ఎన్‌జీవో ప్రతినిధి కె. శివాజీ, మానిటరింగ్ కన్సల్టెంట్ డాక్టర్ బి. ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డీఎంఈవో) బి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.